క్లుప్తంగా

నియోనేటల్ అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన నియోనేటల్ ఐసీయూ అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు. కన్సల్టెంట్ నియోనెటాలజిస్టు డాక్టర్ హెచ్ఏ నవీద్ మాట్లాడుతూ.. ఇందులో అత్యంత అధునాతనమైన ఇంక్యుబేటర్, వెంటిలేటర్, ఆక్సిజన్ లాంటి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటూ పిల్లల ప్రాణాలను కాపాడుతూ ఆసుపత్రికి చేరుస్తుందన్నారు. ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ సేపూరి, పీడియాట్రిక్ వైద్యులు జి.సుధాకర్, రఫిక్, గోవర్ధన్ రెడ్డి, భారతి తదితరులు ఉన్నారు.

కమ్యూనిస్టు సాహిత్యానికి ఆదరణ



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు సాహిత్యానికి తిరిగి ప్రాచుర్యం పెరుగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఉద్ఘాటించారు. పాతబస్టాండ్‌లోని సుర్జీత్ భవన్‌లో శుక్రవారం రెడ్‌బుక్ డేను నగర కార్యదర్శి కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాజ్యం విప్లవం అనే పుస్తకంపై చర్చించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. కమ్యూనిజానికి కాలం చెల్లిందని ఉదరగొట్టే పెట్టుబడిదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

దోమలను నివారించాలి



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): ఇళ్లు, పరిసరాల్లో దోమలు పెరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని 41వ సచివాలయం లక్ష్మీగార్డెన్స్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రజ లు తమ ఇళ్లు, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమల పెరుగుదలను అరికట్టాలని సూచించారు. తద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులను అరికట్టవచ్చన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త అరుణ, అడ్మిన్ సెక్రటరీ అనురాధ, ఆశా కార్యకర్త ఉమాదేవి పాల్గొన్నారు.

పకడ్బందీగా పీ- 4 సర్వే



సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగి

కర్నూలు (టౌన్): పేదరిక నిర్మూలన ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్. పార్ట్‌నర్‌షిప్ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణతో కలిసి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందితో పీ-4 సర్వే ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని 133 సచివాలయాల పరిధిలో 82,628 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉండగా శుక్రవారం సాయంత్రం నాటికి 18.39 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజల ఇంటి వద్ద కు సచివాలయ సిబ్బంది వెళ్లి కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యులు, సంపాదన, విద్య, వృత్తి, భూములు, సాంకేతిక పరికరాలు, విద్యుత్ సరఫరా, గ్యాస్ కనెక్షన్, శుద్ధ జల వినియోగం, బ్యాంకు ఖాతా, ఖర్చులు, అద్దె, ఆరోగ్యం, గతేడాది ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ పథకాలు వంటి వివరాలను సేకరించి పీ – 4 యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మందికి ఆర్థికంగా బలంగా ఉన్న 10 శాతం మంది చేయూతనిచ్చే కార్యక్రమం సక్రమంగా అమలు జరుగుతుందని చెప్పారు.

మధురమైనది మాతృ భాష



టీజీవీ కళాక్షేత్రంలో తెలుగుతల్లి చిత్రపటానికి పూజలు



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఘంటసాల గాన సమితి ప్రతినిధులు



మహనీయుల చిత్రపటాలతో విద్యార్థులు



ఆర్‌యూలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహులు



అతిథి మహమ్మద్ మియ్యాను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థలు, సాహితీ సంస్థల్లో నిర్వహించిన వేడుకల్లో పలువురు ప్రముఖులు తెలుగు తల్లి చిత్ర పటానికి, తెలుగు తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి మాట్లాడారు.

● రాయలసీమ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలలో తెలుగు, ఆంగ్ల విభాగాల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్, తెలుగు శాఖ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.నరసింహులు మాట్లాడారు. ప్రతి నాగరిక జాతి తనదైన భాషలోనే మాట్లాడుకుంటుందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకంగా తయారవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ తమ మాతృభాషలను కాపాడుకోడానికి కంకణబద్ధులు కావాలన్నారు. ఇంగ్లిష్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. భాష సంస్కృతి విడదీయరాని అంశాలు కాబట్టి మాతృభాషల మనుగడతోనే సాంస్కృతిక వారసత్వం కొనసాగుతుందన్నారు. తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ జి.అరుణ, ఆంగ్ల విభాగం అధ్యాపకులు జాయిస్, డాక్టర్ సులేఖారాని, షారోన్ తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ బీఈడీ కళాశాలలో జరిగిన మాతృభాషా దినోత్సవ కార్యక్రమంలో గజల్ గాయకుడు మహమ్మద్ మియ్యా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాతృభాషలో కమ్మటి మాధుర్యం ఉంటుందన్నారు. మన అనుబంధాలు, విలువలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచడానికి దోహదం చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ మాట్లాడారు. తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, ఆంగ్ల అధ్యాపకురాలు నాగలక్ష్మి, అధ్యాపకులు వరదరాజులు, కల్యాణ్, మహేష్, లింగస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● పద్మశ్రీ ఘంటసాల గాన సమితి ఆధ్వర్యంలో ఓల్డ్ బస్టాండ్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద మాతృభాషా దినోత్సవ వేడుకలు జరిగాయి. తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్ శర్మ, డాక్టర్ డబ్ల్యూ సీతారాం, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, మధుర కవి ఎలమర్తి రమణయ్య, సమితి అధ్యక్షుడు సుస్వరం వాసుదేవమూర్తి, కోశాధికారి జగన్నాథగుప్త, సభ్యులు పాల్గొన్నారు.

● స్థానిక శంకరాస్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎం.అన్వర్ హుసేన్ పాల్గొని మాట్లాడారు. తెలుగు భాష తియ్యదనం, ప్రపంచంలోని భాషలన్నింటిలో తెలుగు స్థానాన్ని తెలియజేస్తుందన్నారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మద్దిలేటి, తెలుగు అధ్యాపకులు మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

● టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, తెలుగు ఉపాధ్యాయులు ఇనాయతుల్లా, చంద్రమౌళిని ఘనంగా సన్మానించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, ఉపాధ్యక్షులు సీవీ రెడ్డి సభ్యులు ఇనాయతుల్లా, గాండ్ల లక్ష్మన్న, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

● ఎస్ఏపీ క్యాంప్‌లోని కట్టమంచి రామలింగారెడ్డి నగర పాలక సంస్థ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.వెంకటరెడ్డి, తెలుగు ఉపాధ్యాయులు మహాలక్ష్మి, చంద్రకళా దేవి, మనోరంజని, సుజాత, పాల్గొన్నారు. కేవీఆర్ కళాశాలలో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, తెలుగు విభాగాధిపతి ప్రమీల, అరసం గౌరవాధ్యక్షుడు హరికిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు



ఎస్పీకి బొకే అందజేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి కలిశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలసి పూలబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): మార్చి 8వ తేదీన జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పి.శ్రావణిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పా టు చేసిన ఏపీ మహిళా సమాఖ్య సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1500, తల్లికి వందనం పథకాలు వెంటనే అమలు చేయాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: నగరంలో ప్రణాళికబద్ధంగా కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం 19వ వార్డు జొహరపురం, రాంప్రియ నగర్, వెంకటాద్రి నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలకు మేయర్, ఎమ్మెల్యే, కమిషనర్ రవీంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరై శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేటర్ పరమేష్, ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ శేషసాయి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన పీఠం సేవలు అజరామరం



విజ్ఞాన పీఠం విద్యార్థులు, ఉపాధ్యాయులతో అతిథులు

కర్నూలు కల్చరల్: విజ్ఞాన పీఠం అరక్షిత శిశు మందిరంలో పేద విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం, భారతీయత పట్ల అవగాహన కలిగించేలా విద్యబోధన అందించడం అభినందనీయమని వీహెచ్‌పీ కేంద్రీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు అన్నారు. శుక్రవారం విజ్ఞాన మందిరాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. సేవాహి పరమోధర్మః అన్న ఆర్యోక్తి ప్రకారం అత్యంత క్రమశిక్షణ గల వ్యక్తి గుణంపల్లి పుల్లారెడ్డి 1971లో విజ్ఞాన మందిరం స్థాపించి వేలాది మంది పిల్లలకు విద్యను అందించడం మహోన్నతమైందన్నారు. వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన పీఠంలో చదువుతో పాటు సంస్కృతి సంప్రదాయ విలువలు బోధిస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. అనంతరం గోకరాజు గంగరాజును జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ సుబ్బారెడ్డి సన్మానించారు. విజ్ఞాన పీఠం ప్రధానాచార్యులు మాళిగి వ్యాసరాజ్, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బజరంగ్ దల్ కన్వీనర్ సందీప్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు



హరికుమార్ (ఫైల్)

ఓర్వకల్లు: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన రసిక ఆంజనేయులు కుమారుడు రసిక హరికుమార్ అలియాస్ సాయి(23) రెండు నెలల క్రితం ఆస్తి కోసం కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అప్పటి నుంచి మన స్తాపంతో ఉన్నాడు. ఈ నెల 15వ తేదీ ఆంజనేయులు కుటుంబ సభ్యులతో పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా హరికుమార్ లేడు. ఇంటికి తాళం వేసి, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో అతని స్నేహితులు, బంధువులను విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. యువకుని ఆచూకీ తెలిసినవారు 9121101067, 9121101065 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

శిశువుల్లో లోపాలను గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో పిల్లలకు వచ్చే లోపాలను ముందుగానే గుర్తిస్తే చికిత్స సులభం అవుతుందని లీగల్ సర్వీసెస్ అండ్‌పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటీ స్కీమ్ కమిటీ మెంబర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకటశేషాద్రి ఆదేశాల మేరకు.. ఆరేళ్లలోపు చిన్నారుల్లో వైకల్యాల గుర్తింపు, ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక వన్‌టౌన్ ప్రాంతంలోని పెద్దపడఖానా, బండిమెట్ట, మంగలిగేరి, రాంబొట్ల దేవాలయ పరిసర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పుట్టుకతో వచ్చే లోపాలు, ఆలస్యంగా అభివృద్ధి చెందే సమస్యలు, పోషక లోపాలు, మానసిక ఆరోగ్య సమస్యలను తొలి దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డైస్) ఉందన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం కింద పనిచేస్తుందని, ఇక్కడ ప్రత్యేక శిశు వైద్యులు, ఫిజియోథెరపిస్టులు, చిన్నారుల మానసిక వైద్య నిపుణులు, స్పీచ్ థెరపిస్టులు ఉంటారని, వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు.

మహాలక్ష్మి నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు: కర్నూలు రేంజ్ డీఐజీ బంగ్లాకు కూతవేటు దూరంలో ఉన్న మహాలక్ష్మి నగర్‌లో గొలుసు దొంగ హల్‌చల్ సృష్టించాడు. వాకింగ్ చేస్తున్న వృద్ధురాలు నాగలక్ష్మమ్మ (83) మెడలో మూడు తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించాడు. వివరాలు.. పాములపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ కుటుంబ సభ్యులు 25 ఏళ్లుగా కర్నూలులోని మహాలక్ష్మి నగర్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం నాగలక్ష్మమ్మ వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని యువకుడు నడుచుకుంటూ వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాగాడు. ఆమె అప్రమత్తమై దొంగ అని అరిచేలోగా పక్క సందు గుండా కనిపించకుండా పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం పార్టీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి నేరం జరిగిన తీరుపై ఆరా తీశారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించి దొంగను గుర్తించే పనిలో పడ్డారు.

నోటీస్ బోర్డు

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో చేపట్టనున్న అభివృద్ధి, మరమ్మతుల పనుల కారణంగా పాత పట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యు త్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జొహరాపురం, చిత్తారిగేరి, జమ్మిచెట్టు ఏరియాలలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు నరసింహారెడ్డి వర్ధంతి

కర్నూలు కల్చరల్: స్వాతంత్ర్య సరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని ఏక్యాంప్‌లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లో శనివారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి అధ్యక్షుడు వి.విజయమోహన్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. అలాగే వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం

కర్నూలు కల్చరల్: కేంద్ర బడ్జెట్ 2025-26పై శనివారం ఉదయం 10 గంటలకు మౌర్య ఇన్ పరిణయ ఫంక్షన్ హాల్‌లో మేధావుల సమావేశం నిర్వహించనున్నట్లు కార్యక్రమ కన్వీనర్, విశ్వభారతి మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటరమణ తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.రామకృష్ణ అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ప్రధాన వక్తగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రభుత్వం ద్వారానే టమాట కొనుగోలు

జాయింట్ కలెక్టర్ బి.నవ్య

పత్తికొండ రూరల్ : ప్రభుత్వం ద్వారానే టమాట కొనుగోలు చేసి కర్నూలు రైతు బజారుకు తరలిస్తామని జాయింట్ కలెక్టర్ బి.నవ్య తెలిపారు. కొన్నిరోజుల క్రితం టమాట కొనుగోలు కేంద్రం మూతబడింది. దీంతో టమాట రైతులకు గిట్టుబాటు ధర లేక, కొనుగోలు కేంద్రం లేకపోవడంతో శుక్రవారం పత్తికొండలోని వ్యవసాయ మార్కెట్ యార్డును జేసీ తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్థానిక రైతుల నుంచి వ్యాపారులు కిలో రూ.10 గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని, లేదంటే ప్రభుత్వం ద్వారానే కొనుగోలు చేసి కర్నూలులోని రైతు బజారుకు తరలిస్తామని చెప్పారు. ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ, మార్కెట్ సెక్రటరీ కార్నలీస్ ఉన్నారు.

నర్సుల సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతిపత్రం ఇస్తున్న నర్సింగ్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు (హాస్పిటల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులకు వీక్లీ ఆఫ్‌లు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇవ్వాలని, మహిళా స్టాఫ్ నర్సులకు అదనంగా ఐదు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు లీలావతి, ఉపాధ్యక్షురాలు శాంతి భవానీ, సెక్రటరీ బంగారి, ఈసీ మెంబర్లు సోమేశ్వరి, ఉమారాణి ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పేదలకు షరతులు లేకుండా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో మునగాలపాడు సచివాలయం ఎదుట ఇళ్ల స్థలాల కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అర్హులందరికీ స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తానని మాట ఇచ్చారని, అయితే ఇప్పుడు మాత్రం షరతులు పెట్టి ఇళ్ల స్థలాలను పొందడానికి వీలు లేకుండా చేయడం భావ్యం కాదన్నారు. ఐదెకరాల పొలం మాత్రమే ఉండాలని, కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటకూడదని, ఇంట్లో ఉద్యోగం చేసే వారు ఉండకూడదని, ఇన్‌కమ్ ట్యాక్స్ కట్టే వారు అనర్హులని, కుటుంబ ఆదాయం రూ.1.20 లక్షలకు దాటకూడదని షరతులు పెట్టడం అన్యాయమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అలాగే ఇళ్లు కట్టుకోవడానికి ఇస్తామన్న రూ.4 లక్షలను రూ.ఐదు లక్షలకు పెంచాలని, ఇసుక, ఇనుమును ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ భవనాన్ని ఉర్దూ వర్సిటీకి కేటాయించొద్దు



క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల భవనాన్ని ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించొద్దని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ మాట్లాడుతూ.. ఎంతో మంది గ్రామీణ మధ్య తరగతి విద్యార్థులు ఫర్ మెన్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఉన్న ఫలంగా కళాశాల భవనాన్ని ఉర్దూ వర్సిటీకి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు ఖాజావలి, నాయకులు మురళి, హరి, రవి తదితరులు రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.





అతిథులను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



హ్యాపీ డేస్..

కర్నూలు కల్చరల్: టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 54వ వార్షికోత్సవం, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. డీవీఈఓ పరమేశ్వరెడ్డి, ఆర్ఐఓ గురవయ్య శెట్టి, కళాశాల పూర్వపు, విశ్రాంత ప్రిన్సిపాల్లు తిమ్మయ్య, కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని సాకారం చేసుకునేందుకు ఇష్టంగా కష్టపడాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ సుంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలప్ప, అధ్యాపకులు ప్రభు, రహిమాన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.